# 7. మహా ప్రవక్త (స) ఆదర్శజీవితం

لَقَدْ كَانَ لَكُمْ فِي رَسُولِ اللَّهِ أُسْوَةٌ حَسَنَةٌ لِّمَن كَانَ يَرْجُو اللَّهَ وَالْيَوْمَ الْآخِرَ وَذَكَرَ اللَّهَ كَثِيرًا

**నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది- అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు.** ***(అల్ అహ్‌జాబ్ 33 : 21)***

**ముస్లిం సోదర సోదరీమణులారా!**

దైవ ప్రవక్త ముహమ్మద్ (స) పవిత్ర జీవితచరిత్ర, గుణగణాలు అలవాట్లు మహితోక్తుల గురించి నేటి జుమా ఖుత్బాలో తెలుసుకుందాం.

దైవ ప్రవక్త ముహమ్మద్ (స) పూర్తి పవిత్ర జీవితం 63 సంవత్సరాలు. ఆ పవిత్ర జీవితంలో అనేక భాగాలు, అంశాలు, కోణాలు ఉన్నాయి. వాటన్నింటిని లిఖించడానికి ఎన్ని గ్రంథాలైనా సరిపోవు. కాబట్టి ఆయన (స) జీవిత చరిత్రలోని కొన్ని ముఖ్యమైన ఘట్టాలను, అంశాలను తెలుసుకుందాం. తత్ఫలితంగా మనం మహోనీయ ముహమ్మద్ ప్రవక్త (స) జీవిత చరిత్రను అస్వాదించి, వారి గుణగణాలు, పవిత్ర అలవాట్లను ఆదర్శంగా మన జీవితాలను మలచుకుందాం. దైవ ప్రవక్త (స) జీవిత చరితంలోని విభాగాలన్నీ మనకు ఆదర్శమే. వారి అంతర్యమూ, బాహ్యము సర్వము మనకు ఆదర్శప్రాయమే. ఉమ్మహాతుల్ మోమినీన్ ఆయిషా (రజి. అన్హా) తో కొందరు దైవ ప్రవక్త (స) గుణగుణాలు, నైతిక లక్షణాలను గురించి ప్రశ్నించగా ఆమె ఇలా బదులిచ్చారు: **كَانَ خُلُقُهُ الْقُرْآنَ "కాన ఖులుఖుహుల్ ఖుర్‌ఆన్"** ఏమిటి మీరు ఖుర్‌ఆన్ చదవరా? ఆయన గుణగుణాలు ఖుర్‌ఆన్ ప్రబోధనలకు ప్రతిబింబం".

సత్యప్రదాత ముహమ్మద్ (స) గుణగణాలన్నీ దైవ గ్రంథం ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడ్డాయి. అందుకే అల్లాహ్ ఆ మహాప్రవక్తను నైతిక శిఖరాల మకుటంగా అభివర్ణించాడు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **وَإِنَّكَ لَعَلَىٰ خُلُقٍ عَظِيمٍ** "వ ఇన్నక

teluguislam.net



**లఅలా ఖులుఖిన్ అజీమ్"** ఓ ప్రవక్తా! మీరు నైతికంగా ఉన్నత శిఖరాన్ని అధిరోహించి ఉన్నారు. *(అల్ ఖలమ్ 68:4)*

సృష్టికర్త అల్లాహ్ తన అంతిమ ప్రవక్తను యావత్తులోకానికి కారుణ్యమూర్తిగా చేసి ప్రభవింపజేశాడు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **وَمَا أَرْسَلْنَاكَ إِلَّا رَحْمَةً لِّلْعَالَمِينَ** **"వమా అర్‌సల్నాక ఇల్లా రహ్మతల్లిల్ ఆలమీన్"**. ఓ ముహమ్మద్(స)! మేము నిన్ను సమస్త లోకవాసుల కోసం కారుణ్యంగా చేసి పంపాము.

*(అల్ అంబియా 21 : 107)*

ఆయన పవిత్ర జీవితంలోని ప్రతి కోణంలో ఒక ప్రత్యేకత ఉట్టిపడుతూ ఉంది. ఆయన చరిత్ర సైతం ఒక నిండు వెన్నెల. ఆ పవిత్ర చరిత్రలోని కొన్ని ముఖ్య ఘట్టాలను, భాగాలను ఇప్పుడు తెలుసుకుందాం.

ఆయిషా సిద్దీఖా (రజి.అన్హా) ఆయన(స) నిరాడంబరత, ఐహిక అనాస్తకత గురించి ఇలా తెలుపుతున్నారు. దైవ ప్రవక్త (స) దైవందిన జీవితం ఎలా ఉండే దంటే, ఆయన తన పూర్తి జీవితంలో నిగంతరం ఏ రెండు రోజులు కూడా జొన్న రొట్టెలు కడుపు నిండా తినలేదు. అలాంటి అవకాశం కూడా ఆయనకు ఏనాడూ కలుగలేదు. *(సునన్ తిర్మిజీ)*

ఆయన ప్రత్యేక సేవకుడైన అనస్ (రజి) ఇలా తెలిపారు: ఒక రోజు దైవ ప్రవక్త(స) బాగా ఆకలిగా ఉన్నారు. ముఖకవళికలు ఆయన ఆకలి వేదనను ప్రస్ఫుటం జేస్తున్నాయి. వారి పరిస్థితిని గ్రహించిన నేను జొన్న రొట్టెను కాస్త కొవ్వు పదార్థాన్ని తీసుకుని వారి సన్నిధికి చేరాను. దాంతో ఆయన తమ ఆకలి తీర్చుకున్నారు. ఆ సమయంలో ఆయన తన యుద్ధ కవచాన్ని కొన్నిసేర్ల (ధాన్యానికి) బదులుగా తాకట్టు పెట్టి ఉన్నారు. *(సునన్ తిర్మిజీ)*

ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఒకసారి చాపపై పడుకుని ఉండటం చూశాను. ఆయన పవిత్ర దేహంపై ఆ చాప గుర్తులు కూడా చూశాను. ఆయన బాధను చూసి "ప్రవక్తా! ముస్లింలకు భోగభాగ్యాలు లభించాలని మీరు దుఆ చేయండి "కిస్రా, ఖైసర్ లాంటి అవిశ్వాసులకు సిరిసంపదలెలా ఉన్నాయో చూడండి? అని అన్నాను. అది విన్న దైవ ప్రవక్త (స) "ఓ ఉమర్! నీవు కూడా ఇలాంటి మాటలే పలుకుతావా? అవిశ్వాసులకు ఈ తాత్కాలిక ప్రాపంచిక భోగవిలాసాలే కాని మనకు

శాశ్వతస్వర్గం తయారు చేయబడి ఉంది. అనే ఈ విషయం పట్ల నీకు సంతోషం లేదా?" అని అన్నారు. (సునన్ తిర్మిజీ)

దైవ ప్రవక్త (స) తన నిత్యజీవితంలో సదా ఇలా దుఆ చేసేవారు: ఓ ప్రభూ! జీవితాంతం నన్ను ఓ నిరుపేదగా ఉంచు నిరుపేదగానే నాకు మృత్యువు ప్రసాదించు, ప్రళయదినాన నిరుపేదలతోనే నన్ను నిలబెట్టు". నిరుపేదగా ఉండటం అంటే తన కుటుంబం సదా ఆకలితో ఆలమటిస్తూ ఉండాలని భావం కాదు. స్వయంగా ఆయనే ఆకలి అలమటల నుండి శరణుకోరేవారు. దానర్థం తన మనసులో కృతజ్ఞతా భావం, అణుకువ, వినమ్రత జనించటం. గర్వం అహంకారం లాంటి చెడు లక్షణాల నుండి మనసులను పవిత్రం చేయటం.